Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

బుధవారం 03-06-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 352 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

## సుప్రీంకోర్టు జడ్జీలుగా అయిదుగురు ప్రమాణం

- 37కు పెరిగిన జడ్జీల సంఖ్య



2 లో

సుప్రీంకోర్టు కు కొత్తగా మరో అయిదుగురు జడ్జీలు వచ్చేశారు.మంగళవారం ఆ అయిదుగురు కొత్త జడ్జీలు ప్రమాణ స్వీకారం చేశారు. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య 37కు చేరకున్నది. ప్రస్తుతం ఒకే ఒక్క పోస్టు ఖాళీగా ఉంది.

## ధాన్యం కొనుగోళ్లలో కేంద్రం హామీలకే పరిమితం

- రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం: మంత్రి పొన్నం ప్రభాకర్
- సన్నధాన్యానికి బోనస్.. రైతులకు ప్రోత్సాహక చర్యలు
- త్వరలో మరిన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల

సిద్దిపేట, జూన్ 2: ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సహకరించకుండా హామీలకే పరిమితమైందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని ఆయన పేర్కొన్నారు.



2 లో

## 2028లో మళ్లీ కేసీఆరే సీఎం

'పుష్కర తెలంగాణ.. ముష్కర తెలంగాణగా మారింది'

- కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ విమర్శలు
- తెలంగాణ భవన్‌లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణే పార్టీ లక్ష్యమని స్పష్టం

హైదరాబాద్, జూన్ 2: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ అభివృద్ధి దిశ కోల్పోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఒకప్పుడు సంక్షేమం, అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు.



2 లో

## మిలియన్ మార్చ్ ను తలపించేలా భూపోరాటం

- జులై 2 న ఉప్పల్ భగాయత్ లో పెద్ద ఎత్తున భూపోరాటం చేస్తాం
- పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిస్తున్న
- ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి ప్రకటన చేయకపోవటం దుర్మార్గం
- ఆగస్ట్ 6 లోగా ప్రొఫెసర్ జయశంకర్ గారి విగ్రహం ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



4 లో

## గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు..

- పవన్ సూచనలు పరిగణనలోకి తీసుకోవాలి: చంద్రబాబు




2 లో

అమరావతి, జూన్ 2: 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పుష్కరాల సందర్భంగా కోట్లాది మంది భక్తులు తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

## అందుకే 'మావిగన్' ప్రతిపాదన

### రైతుల అభిప్రాయాలకే ప్రాధాన్యం : జగన్



2 లో

తాడేపల్లి, జూన్ 2: రాజధాని ప్రాంత రైతుల అభిప్రాయాలను గౌరవిస్తూ, వారి ప్రయోజనాలకు అనుగుణంగానే ముందుకు సాగుతామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. రైతులను బలవంతపెట్టి నిర్ణయాలు అమలు చేయడం సమంజసం కాదని, వారికి ఇబ్బందులు కలిగించే విధానాల కంటే సహకారం అందించే చర్యలకే ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.

రాజధాని ప్రాంతానికి చెందిన ఉండవల్లి, పెనుమాక, నిడమర్రు, నేలపాడు తదితర గ్రామాల రైతులు జగన్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు.



## సంక్షేమం-అభివృద్ధికి సమ ప్రాధాన్యం

- ప్రజల ఆశయాల సాధనలో ప్రభుత్వం విజయవంతం: సీఎం రేవంత్ రెడ్డి
- 67 వేలకుపైగా ఉద్యోగాల భర్తీ
- మరిన్ని టీజీపీఎస్సీ నోటిఫికేషన్లు త్వరలో
- రైతు సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి
- విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాల్లో విస్తరణ చర్యలు – మహిళా సాధికారతకు ప్రోత్సాహం
- 2047 లక్ష్యంగా అభివృద్ధి

హైదరాబాద్, జూన్ 2: సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత రెండున్నరేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి కృషి చేసిన నాయకులను స్మరించుకున్న సీఎం, రాష్ట్ర ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు తెలంగాణ సమాజం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, ప్రజలే పాలకులను నిర్ణయిస్తారని పేర్కొన్నారు.

### ఉద్యోగాల భర్తీకి వేగం

రాష్ట్రంలో ఉద్యోగ నియామక ప్రక్రియను పారదర్శకంగా కొనసాగిస్తున్నామని సీఎం తెలిపారు. ఇప్పటివరకు 67 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు వెల్లడించారు. ఈ నెలలో టీజీపీఎస్సీ ద్వారా మరిన్ని నోటిఫికేషన్లు విడుదల కానున్నాయని చెప్పారు. ఇంజినీరింగ్, అటవీ, టౌన్ ప్లానింగ్, విద్యాశాఖ తదితర విభాగాల్లో ఖాళీల భర్తీ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

విద్యారంగంలో విస్తరణ

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులను విస్తరించడంతో పాటు విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజన కార్యక్రమాలను అమలు చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు.

2 లో



## తెలంగాణలోనూ జనసేన పోటీ చేస్తుంది



2 లో

- తెలంగాణ ఎవరి జాగీరు కాదు"
- తెలంగాణలో జనసేన బలంగా ఉంటుంది
- బెదిరింపులకు భయపడను.. ప్రజా సమస్యలపై మాట్లాడుతూనే ఉంటా – పవన్ కల్యాణ్

హైదరాబాద్, జూన్ 2: తెలంగాణలో ప్రజల సమస్యలపై మాట్లాడే హక్కు జనసేన పార్టీకి ఉందని, రాష్ట్రం ఎవరి వ్యక్తిగత జాగీరు కాదని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

తెలంగాణలో లక్షలాది మంది జనసేన కార్యకర్తలు ఉన్నారని పేర్కొన్న పవన్, ప్రజా సమస్యలపై స్పందించడం రాజకీయ పార్టీగా తమ బాధ్యత అని అన్నారు. జనసేన పార్టీని హైదరాబాద్ నగరంలోనే స్థాపించామని గుర్తు చేస్తూ, తెలంగాణపై తమకు కొత్తగా ప్రేమ పుట్టలేదని వ్యాఖ్యానించారు.

"తెలంగాణ గురించి జనసేన ఎందుకు మాట్లాడుతోందని కొందరు ప్రశ్నిస్తున్నారు. నేను తెలంగాణ నాలుగు మూలలూ తిరిగాను. ఆదిలాబాద్ వంటి నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో కూడా పర్యటించాను. ఇప్పుడు విమర్శలు చేస్తున్న వారిలో చాలామంది అప్పట్లో అక్కడికి వెళ్లలేదు" అని ఆయన అన్నారు.

రాష్ట్ర విభజన జరిగిన విధానంపైనే తనకు అభ్యంతరం తప్ప, తెలంగాణకు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలకు, నాయకులకు ఆంధ్రప్రదేశ్ ప్రజలపై ఎలాంటి విద్వేషం లేదని పేర్కొన్నారు.

## 'సైకిల్' పవర్ చాటేందుకు..
# సైకిల్‌పైనే వెళ్లండి: చంద్రబాబు



అమరావతి: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెదేపా ఎమ్మెల్యేలకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. జనసేన, భాజపాతో కలిసి సమన్వయం చేసుకొని 'సర్'ని పర్యవేక్షించాలన్నారు. తెదేపా ప్రధాన పార్టీగా ఉన్నందున పూర్తి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. 'సర్'పై తెదేపా ఎమ్మెల్యేలకు చంద్రబాబు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ తరగతులకు హాజరుకాని నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

"రాష్ట్రంలో 2002 తర్వాత ఓటర్ల జాబితా సవరణ జరుగుతోంది. మన ఓట్లు తీసేసి.. వాళ్ల ఓట్లు పెట్టేలా కుట్రలకు గొడ్డలి పార్టీ వెనుకాడదు. 'సర్' సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. మాకేం సంబంధం లేదన్నట్లుగా ఎంపీలు ఉంటే సరికాదు. జులై 14 లోపు ఓట్లు ఉండేలా చూసుకోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయి. పార్టీ ఉంటేనే ప్రభుత్వం వస్తుందనే బాధ్యతతో ప్రతి ఒక్కరూ పని చేయాలి. పవర్ ఆఫ్ సైకిల్ చాటేందుకు నెలలో కొన్ని రోజులు సైకిల్‌పై వెళ్తా.

సైకిల్ పవర్ చూపించేందుకు ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ సైకిల్ వాడండి. దీని వల్ల ఖర్చు సున్నా.. ఆరోగ్యానికి ఆరోగ్యం. ఎలక్ట్రిక్ సైకిల్‌పై వీలైనన్ని ఎక్కువ ఇళ్లకు తిరుగుదాం. ఈ నెల 4న ఎన్డీయే సమావేశం తర్వాత భవిష్యత్ కార్యాచరణ చేపడతాం. 2024లో కూటమికి వచ్చిన ఓట్ల కంటే వచ్చే ఎన్నికల్లో పెరగాలి. ప్రతి బుధవారం పార్టీ క్యాలెండర్ తప్పనిసరిగా అమలు కావాలి" అని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# సుప్రీంకోర్టు జడ్జీలుగా అయిదుగురు ప్రమాణం

**మొదటి పేజీ తరువాయి**

సుప్రీంకోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య పెరగడం వల్ల .. కొత్త జడ్జీల నియామకం కోరుతూ మే 16వ తేదీన ఆర్డినెన్స్ జారీ చేశారు. సుప్రీం కోర్టులో సుమారు 93 వేల కేసులు ఉన్నట్లు తెలిసింది. జడ్జీలుగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో పంజాబ్-హర్యానా హైకోర్టు సీజే షీల్ నాగు, సీనియర్ న్యాయవాది వీ మోహన్ , బాంబే హైకోర్టు సీజే శ్రీ చంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ్, జమ్మూకశ్మీర్ అండ్ లడాక్ హైకోర్టు సీజే అరుణ్ పల్లి ఉన్నారు. సుప్రీంకోర్టు జడ్జీలు, న్యాయవాదులు, కుటుంబసభ్యులు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఏడాది చివరలో నలుగురు సుప్రీంకోర్టు జడ్జీలు రిటైర్ కానున్నారు.

# 2028లో మళ్లీ కేసీఆరే సీఎం: కేటీఆర్

**మొదటి పేజీ తరువాయి**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర నిర్మాణం వరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్ర కీలకం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ అనేక త్యాగాలు చేశారని కేటీఆర్ అన్నారు. ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ఆయన నాయకత్వం కీలకమైందని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావం అనేక సవాళ్లను అధిగమించి సాధించిన చారిత్రక విజయమని చెప్పారు.

కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులు, తాగునీటి పథకాలు, రైతు సంక్షేమ కార్యక్రమాల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది వేసిన నాయకుడు కేసీఆర్ అని ఆయన కొనియాడారు. ముఖ్యంగా ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో ఆయన కృషి విశేషమని అన్నారు.

ప్రభుత్వ పనితీరుపై విమర్శలు

ప్రస్తుత పాలనలో రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వేగం తగ్గిందని, రాష్ట్రం పురోగతి నుంచి వెనక్కి వెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు.

తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిన విధానాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులపై ప్రజల్లో ఆందోళన పెరుగుతోందని చెప్పారు.

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుంది

రాజకీయంగా బీఆర్ఎస్ గత ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేసి ప్రజల మద్దతు పొందిందని కేటీఆర్ గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బలంగా పునరాగమనం చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

2028 ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తారని, కేసీఆర్ మళ్లీ రాష్ట్ర నాయకత్వ బాధ్యతలు చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధి, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం పార్టీ కట్టుబడి పనిచేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# అందుకే 'మావిగన్' ప్రతిపాదన
## రైతుల అభిప్రాయాలకే ప్రాధాన్యం : జగన్

**మొదటి పేజీ తరువాయి**



ఈ సందర్భంగా రైతులతో సమావేశమైన జగన్, రాజధాని నిర్మాణం, భూసేకరణ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

ఇప్పటికే రాజధాని కోసం సేకరించిన 50 వేల ఎకరాల భూముల వినియోగంపైనే స్పష్టత లేదని ఆయన విమర్శించారు. అలాంటప్పుడు మరో 50 వేల ఎకరాల అవసరం ఉందని ప్రభుత్వం చెప్పడం సమంజసం కాదన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాగా "మావిగన్" ప్రతిపాదనను సూచించినట్లు తెలిపారు.

విజయవాడలో అంతర్జాతీయ ప్రమాణాలతో విమానాశ్రయం ఉండగా మరో ఎయిర్‌పోర్టు అవసరం ఏమిటని జగన్ ప్రశ్నించారు. ప్రస్తుతం అక్కడ విస్తరణ, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, అవి త్వరలో పూర్తికానున్నాయని చెప్పారు. అలాగే మచిలీపట్నం పోర్టు అభివృద్ధికి తమ ప్రభుత్వ హయాంలోనే శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు.

రాష్ట్రంలో జాతీయ రహదారులు, రైల్వే స్టేషన్లు వంటి కీలక మౌలిక సదుపాయాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. ప్రస్తుత విధానాలతో రాజధాని అభివృద్ధికి స్పష్టమైన దిశ కనిపించడం లేదన్నారు.

రాజధాని ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాల కల్పనకే ఎకరాకు సుమారు రూ.2 కోట్ల వరకు ఖర్చవుతుందని జగన్ పేర్కొన్నారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాల కోసం భారీ స్థాయిలో పెట్టుబడులు అవసరమవుతాయని, మొత్తం వ్యయం దాదాపు రూ.2 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేశారు.

రాజధాని అభివృద్ధి పేరుతో భారీ అవినీతి జరుగుతోందని ఆరోపించిన జగన్, "ఎక్కడ చూసినా స్కాములే కనిపిస్తున్నాయి" అని విమర్శించారు. మావిగన్‌ను గ్రోత్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తే రాష్ట్రానికి వేగవంతమైన, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. సుమారు 110 కిలోమీటర్ల పరిధిలో గ్రోత్ కారిడార్‌కు ప్రాధాన్యం ఇస్తే మొత్తం ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

# సంక్షేమం-అభివృద్ధికి సమ ప్రాధాన్యం

**మొదటి పేజీ తరువాయి**

రైతు సంక్షేమంపై దృష్టి

రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడానికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని సీఎం వివరించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల ద్వారా భారీ మొత్తంలో ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను కొనసాగిస్తూనే సౌరశక్తి ఆధారిత పంపుసెట్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరుకోవడం రైతులకు అందిస్తున్న ప్రోత్సాహానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి పంటల సాగు విస్తీర్ణం పెరిగిందని తెలిపారు.

మహిళా సాధికారతకు ప్రోత్సాహం

మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని సీఎం చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు పెద్దఎత్తున సున్నా వడ్డీ రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు గణనీయమైన ప్రయోజనం కలుగుతోందని పేర్కొన్నారు.

2047 లక్ష్యంగా అభివృద్ధి

రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి దిశగా రూపొందించిన ప్రణాళికల్లో రైతులు, యువత, మహిళలకు ప్రాధాన్యం కల్పించామని సీఎం వెల్లడించారు. తెలంగాణను సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# తెలంగాణలోనూ జనసేన పోటీ చేస్తుంది

**మొదటి పేజీ తరువాయి**

హైదరాబాద్‌లో ఎలా అడుగుపెడతారని కొందరు ప్రశ్నించడం ఆశ్చర్యకరమని, తెలంగాణ ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదని ఆయన అన్నారు. "నా ఇంటి చిరునామా చెప్పడానికే ప్రెస్‌మీట్ పెట్టాను. బెదిరింపులకు భయపడే వ్యక్తిని కాదు" అని స్పష్టం చేశారు.

గత 12 ఏళ్లలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ లేదా ఇతర తెలంగాణ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయలేదని పవన్ తెలిపారు. గతంలో వైఎస్సార్‌సీపీ నాయకుల నుంచి బెదిరింపులు ఎదుర్కొన్నానని, అయితే తెలంగాణ ప్రజల నుంచి అలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదని చెప్పారు.

తనపై భూకబ్జా ఆరోపణలు వస్తే వెంటనే విచారణ జరపాలని సవాల్ విసిరిన పవన్, ప్రభుత్వ భూములు లేదా చెరువులను ఆక్రమించి ఉంటే తన ఆస్తులను సీజ్ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఈ సందర్భంగా ప్రజాగాయకుడు గద్దర్‌ను స్మరించిన పవన్ కల్యాణ్, ఆయన ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సమయంలో తనను సంప్రదించగా వెంటనే వాహనం కొనిచ్చానని వెల్లడించారు.

తెలంగాణలో జనసేన పార్టీ తప్పకుండా కొనసాగుతుందని, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేస్తుందని ఆయన ప్రకటించారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రజా సమస్యలపై మాట్లాడుతూనే ఉంటానని చెప్పారు. తెలంగాణ భారతదేశంలో అంతర్భాగమని, రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణ బరాబర్ మా అయ్య జాగీరే..
## పవన్ కల్యాణ్‌కు మంత్రి పొన్నం కౌంటర్



తెలంగాణ మీ అయ్య జాగీరా అంటూ జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ బరాబర్ మా అయ్య జాగీరే అన్నారు. ఈ ప్రాంతం మా తండ్రి, తాతల జాగీరు అని పవన్ మరోసారి తన అహంకారాన్ని ప్రదర్శించారని మండిపడ్డారు. ఇవాళ గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన పవన్ కల్యాణ్ తనకు ఏపీలోనే దిక్కులేదని పవన్ స్వయంగా అంగీకరించారన్నారు. తెలుగు రాష్ట్రాలు ప్రాంతాలుగా విడిపోయి ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం. తెలంగాణ నవ నిర్మాణంతో పవన్ కల్యాణ్ తెలంగాణలో పీకేదేముందని స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పవన్ కల్యాణఅ బీఆర్ఎస్ లేదా బీజేపీ ఎవరో ఒకరు ఎంగేజ్ చేసుకున్న ఆర్టిస్ట్ అని, ఆయనకు సరైన స్క్రిప్ట్ ఇవ్వడం లేదన్నారు. సినిమాల్లో ఆర్టిస్టును స్క్రీన్ టెస్ట్ చేసినట్లు తెలంగాణ రాజకీయాల్లో పవన్ కల్యాణ్ టెస్టు చేస్తున్నారనేది వాస్తవం అన్నారు.

మమ్మల్ని గెలికితే ఊరుకోం:

పవన్ కల్యాణ్ తెలంగాణకు రావడానికి వెళ్లడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవు. కానీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజే గెలికి నవ నిర్మాణం పేరుతో సభ పెడుతామంటే చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ ప్రజలకు ఆంధ్ర ప్రజలకు ఎప్పుడూ స్వాగితిస్తుందన్నారు. మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామన్నారు. పవన్ ఎప్పుడైనా తెలంగాణకు మద్దతు ఇచ్చారా? తెలంగాణ అమరవీరులకు ఏనాడైనా అండగా నిలిచారా అని ప్రశ్నించారు.

# మోదీ రాసిచ్చారు.. పవన్ చదివారు: జగదీశ్ రెడ్డి



హైదరాబాద్: ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి స్పందించారు. పవన్ వ్యాఖ్యలు అర్థరహితంగా ఉన్నాయన్నారు. తెలివితక్కువ మాటలు మాట్లాడటం మంచిది కాదన్నారు. కాంగ్రెస్, జనసేన కలిసి నాటకాలాడుతున్నాయన్న ఆయన.. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకొని డ్రామాలు ఆడుతున్నారంటూ మండిపడ్డారు. మోదీ రాసిచ్చారు.. పవన్‌కల్యాణ్ చదివారంటూ జగదీశ్ రెడ్డి ఆరోపించారు.

# ధాన్యం కొనుగోళ్లలో కేంద్రం హామీలకే పరిమితం

**మొదటి పేజీ తరువాయి**



సిద్దిపేట కలెక్టరేట్‌లో పద్మశాలి కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గుడూరి శ్రీనివాస్‌తో కలిసి మీడియాతో మాట్లాడిన మంత్రి, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పలు కీలక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందిరమ్మ జీవిత బీమా, కొత్త పింఛన్ల మంజూరు, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం వంటి కార్యక్రమాలు ప్రజలకు చేరువవుతున్నాయని చెప్పారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని మంత్రి తెలిపారు. సన్నధాన్యం సాగు ప్రోత్సాహం కోసం బోనస్ అందిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో అధికంగా సన్న వరి సాగు జరిగేలా రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.

వ్యవసాయంలో వైవిధ్యాన్ని ప్రోత్సహించే దిశగా ఆయిల్‌పామ్‌తో పాటు ఇతర వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతులు అదనపు ఆదాయం పొందేలా వ్యవసాయ శాఖ ద్వారా ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని వివరించారు.

వన సంరక్షణకు ప్రత్యేక చర్యలు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వనమహోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో వన సంరక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రజలు స్వీకరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

విద్య, రవాణా రంగాల్లో పురోగతి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం బస్‌స్టాప్‌ల వద్ద అవగాహన కల్పించే ఫ్లెక్సీలు, చిత్రపటాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఆర్టీసీని నష్టాల నుంచి బయటకు తీసుకొచ్చి లాభాల బాటలో నడిపిస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా ఇప్పటికే ఉద్యోగాల భర్తీ కొనసాగుతోందని, త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు విడుదల కానున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

# గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు..

**మొదటి పేజీ తరువాయి**




సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘంతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం పుష్కరాల నిర్వహణకు సంబంధించిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాల కోసం భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు తదితర అంశాలపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పుష్కర ఘాట్ల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల మెరుగుదల, ఆరోగ్య సేవల విస్తరణ, నీటి వనరుల నిర్వహణ వంటి అంశాలపై కూడా సమావేశంలో సమీక్షించారు. ముఖ్యంగా ఆరు జిల్లాల్లోని 525 పుష్కర ఘాట్లను భక్తుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుని కార్యాచరణ రూపొందించాలని సీఎం పేర్కొన్నారు. రాజమహేంద్రవరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మెగాసిటీగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

గోదావరి పుష్కరాలకు సుమారు 10 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. అంతటి భారీ జనసందోహాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని వెల్లడించారు.

రాష్ట్ర ప్రతిష్ఠను పెంచేలా గోదావరి పుష్కరాలను నిర్వహించాలని, ప్రతి అంశంలోనూ నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు.

సమీక్ష సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ, పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వర్చువల్‌గా హాజరయ్యారు. రాష్ట్ర ఉన్నతాధికారులు కూడా సమావేశంలో పాల్గొని ఏర్పాట్లపై వివరాలు అందించారు.

# కాంగ్రెస్ ఎమర్జెన్సీ మైండ్‌సెట్‌కు ఇది నిదర్శనం..
## రామచందర్‌రావు



హైదరాబాద్: ప్రజాస్వామ్యంలో ఎవరైనా సభలు పెట్టుకోవచ్చని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. జనసేన సభకు హైదరాబాద్‌లో అనుమతి ఇవ్వకపోవడం అప్రజాస్వామిక ధోరణి అన్నారు. కాంగ్రెస్ ఎమర్జెన్సీ మైండ్‌సెట్‌కు ఇది నిదర్శనమని అభివర్ణించారు. "కాంగ్రెస్ నిర్ణయాన్ని ఎన్డీయేగా మేం తప్పుబడుతున్నాం. తెలుగు రాష్ట్రాలు పరస్పర సహకారం, స్నేహభావంతో ముందుకెళ్లాలి. రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు కాకుండా అభివృద్ధి విషయంలో పోటీ ఉండాలి" అని అన్నారు.

# పవన్ వ్యాఖ్యలపై కోమటిరెడ్డి ఆగ్రహం

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. తెలంగాణపై పవన్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన విమర్శించారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది చేసిన త్యాగాలను గుర్తు చేస్తూ, రాష్ట్ర అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను సహించబోమన్నారు. తెలంగాణలో రాజకీయ విద్వేషాలను రెచ్చగొట్టకుండా, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై దృష్టి సారించాలని పవన్ కల్యాణ్‌కు సూచించారు.

రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీపడాలే గానీ, ప్రాంతీయ విభేదాలను పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని కోమటిరెడ్డి పేర్కొన్నారు.



# అమరుల త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ






ఇది కద నిజం,మేడిపల్లి: తెలంగాణ ఐక్య కార్యాచరణ (జేఏసీ ) ఆధ్వర్యంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం నాడు తమ వంతు పాత్ర పోషించి మేడిపల్లిలో 42 రోజులు నిరాహార దీక్ష చేసిన ఘనత పంగ మహేందర్, జహీదా బేగం, నల్ల భాస్కర్ రెడ్డి పాలకుర్తి శేషగిరిరావు, అప్పలాచారి, లోడే చంద్రయ్య, నర్సయ్య గౌడ్ ప్రముఖుల ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు, రాస్తారోకోలు వంటావార్పు ఎన్నో కార్యక్రమాలు చేపట్టి తెలంగాణ రాష్ట్రం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నినాదంతో ముందుకెళ్లిన మేడిపల్లి తెలంగాణ ఐక్య కార్యాచరణ (జేఏసీ )కు దక్కిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఉద్యమకారురాలు జహీదా బేగం మాట్లాడుతూ సకలజనుల సమ్మె ఎంతోమంది అమరుల త్యాగాలపై ఏర్పడిన తెలంగాణ అస్తిత్వం నుండి బయటపడడానికి నిధులు నియామకాలు ఎజెండాతో బంగారు తెలంగాణ ఏర్పడిందని, నాడు ఏర్పడిన తెలంగాణ నేడు యువతకు విద్యా ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పాలకులు రూపకల్పన చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పలువురు జెండా ఆవిష్కరణలో పాల్గొన్నవారు పాలకుర్తి శేషగిరిరావు, నరహరి రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.







## హైదర్‌గూడలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఇది కద నిజం, అత్తాపూర్:తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదర్‌గూడ చౌరస్తాలో వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన హైదర్‌గూడ చౌరస్తాలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సంబరాలలో గ్రామ పెద్దలు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కొలన్ సుభాష్ రెడ్డి, మోంద్ర కొమురయ్య, కొంగళ్ళ బుచ్చయ్య, సోమారం రవీందర్, బర్ల మల్లారెడ్డి, సోమారం రాజ్ కుమార్, కొండమీది హరినాథ్, కొలన్ సుధాకర్ రెడ్డి, రావుల జంగయ్య, బీట్కూరి హరినాథ్, సనివెల్లి జయానంద్ రెడ్డి, నల్లింగ్ రమేష్, చిట్టిగారి చిన్నా నరేందర్, యం. బాలసుబ్రమణ్యం, యూ. శ్రీకాంత్, సాబాధ విజయ్ కుమార్, సులిగె వెంకటేష్, కాకులారం కృష్ణ, గౌరిగే రాజు, మ్యాడం రాము, ఆర్. సదానంద్, పొట్ట అనిల్, దాంచెట్టి రాజేష్, రవీందర్ గౌడ్, నల్లింగ్ అజయ్, రాజేష్ కుమార్, సురేష్ భాటి, గట్టగోని మధు, కన్నయ్య లాల్‌లతో పాటు స్థానిక యువతీ యువకులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### అమరుల త్యాగాల ఫలితమే ప్రత్యేక రాష్ట్రం -- సీపీఐ




ఇది కద నిజం, రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ మండల పరిధిలోని సిపిఐ కార్యాలయం 'ఏఆర్ దేవరాజ్ భవన్' దగ్గర జాతీయ జెండా ఆవిష్కరణ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ సభ్యులు పుస్తకాలు నర్సింగరావు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తకాలు నర్సింగరావు, కన్యగారి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ అనేక మంది అమరుల త్యాగాలు, ప్రజా పోరాటాల ఫలితంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిందని గుర్తుచేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాలని, పేదలు, రైతులు, కార్మికులు, యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం పనిచేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని సహజ వనరులు ప్రజల సంక్షేమానికి వినియోగపడాలని, ఉపాధి అవకాశాలు పెంపొందిస్తూ సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో జిల్లా కౌన్సిల్ సభ్యులు జె. ఆనంద్ గౌడ్, మండల సహాయ కార్యదర్శి జె. విజయనంద్ గౌడ్, సిపిఐ మండల కార్యాలయం కార్యదర్శి జీ. సత్యం, భారత జాతీయ మహిళా సమైక్య (NFIW) రాజేంద్రనగర్ మండల అధ్యక్షురాలు మునీశ్వరి, ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎండి. సలీం, సయ్యద్ ఖాజా, సిపిఐ శాఖ కార్యదర్శులు సిహెచ్. నర్సిరెడ్డి, జే. సదానంద గౌడ్, అలాగే పార్టీ నాయకులు పాండు, సాబీర్, వాణి, హుస్సేన్ భాయ్, అలీ భాయ్, సుశీల, నాగార్జున చారి, శ్రీను, రవి, ప్రభాకర్, నాగరాజు, గంగారం తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# మునుగోడులో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

### అమరవీరులను, ఉద్యమకారులను విస్మరించిన బీఆర్ఎస్, కాంగ్రెస్: తెలంగాణ మాధవక్క

ఇది కద నిజం,మునుగోడు: తెలంగాణ రక్షణ సేన పార్టీ మునుగోడు నియోజకవర్గం ఇన్‌చార్జ్ తెలంగాణ మాధవక్క ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం తెలంగాణ మాధవక్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి అమరవీరులను, ఉద్యమకారులను గుర్తించడంలో అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని తీవ్రంగా విమర్శించారు. ఎంతోమంది ప్రాణాల త్యాగాలతో, ఉద్యమాలతో సిద్ధించిన తెలంగాణలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఎక్కడికక్కడే అటకెక్కాయని ఆమె మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని, అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితమ్మ హామీ ఇచ్చారని తెలంగాణ మాధవక్క ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర నాయకులు మేడి నరేష్, నియోజకవర్గ నాయకులు బొజ్జ లక్ష్మి, పందుల జయసుధ, మండల నాయకుడు కారింగ్ మహేష్, అలాగే ముఖ్య నాయకులు చిరుమర్తి ఉపేందర్, అశోక్, అలివేలు, మానస, మౌనికతో పాటు పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జాతీయ జెండాకు అవమానం

### ఒకే స్తంభంపై జాతీయ పతాకం, బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ!






ఇది కద నిజం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల వేళ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో తీవ్ర వివాదాస్పద ఘటన వెలుగుచూసింది. అయోధ్య నగర్ ఎక్స్ రోడ్ వద్ద నిర్వహించిన వేడుకల్లో భాగంగా, జాతీయ జెండాను ఎగురవేసిన అదే స్తంభానికి బిఆర్ఎస్ పార్టీ జెండాను కూడా ఆవిష్కరించడం స్థానికంగా కలకలం రేపింది. దేశ సార్వభౌమాధికారానికి, 140 కోట్ల మంది భారతీయుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన జాతీయ పతాకాన్ని, ఒక రాజకీయ పార్టీ జెండాతో కలిపి ఒకే స్తంభంపై ఎగురవేయడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫ్లాగ్ కోడ్ అఫ్ ఇండియా , 2002 నిబంధనల ప్రకారం జాతీయ జెండాకు ఇచ్చే విశిష్ట గౌరవానికి భంగం కలిగించేలా, దానికి సమానంగా రాజకీయ జెండాలను ప్రదర్శించడం చట్టవిరుద్ధమని మేధావులు పేర్కొంటున్నారు. "దేశం ముందు -- పార్టీ తర్వాత" అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, ఈ ఘటనపై బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం ప్రజలకు తక్షణమే వివరణ ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. జాతీయ జెండా గౌరవాన్ని ఉల్లంఘించిన ఈ ఉదంతంపై సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

# రవీంద్రభారతిలో మహిళా కవి సమ్మేళనం

### ప్రముఖ కవయిత్రి డాక్టర్ రూపకు ప్రశంసా పత్రం బహూకరణ




ఇది కద నిజం:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల సాంస్కృతిక కళా రూపాల ప్రదర్శనలో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మహిళా కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించబడింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ సమ్మేళనంలో పాల్గొన్న ప్రముఖ కవయిత్రి డాక్టర్ రూప తన కవితా గానంతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, ప్రముఖ కవి, తెలంగాణ రుబాయిల సృష్టికర్త డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి (ఐఏఎస్ ) చేతుల మీదుగా ఆమె ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. సాహిత్య రంగానికి, మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రూపకు ఈ గౌరవం దక్కడం పట్ల పలువురు సాహితీవేత్తలు, తోటి కవులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# సికింద్రాబాద్‌లో ఘనంగా తెలంగాణ అవతరణ వేడుకలు

### జాతీయ జెండాను ఆవిష్కరించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్




ఇది కద నిజం,సికింద్రాబాద్, జూన్ 2: సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. సితాఫలమండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్ర సాధనలో తమ వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించినట్లు గుర్తుచేసుకున్నారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, నియోజకవర్గ ప్రజలకు మరియు రాష్ట్ర ప్రజలందరికీ ఆయన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజలతో పాటు సితాఫలమండీ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది, సెట్విన్ కేంద్రం సిబ్బంది, నియోజకవర్గ ముఖ్య నేతలు, అధికారులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు సికింద్రాబాద్ నియోజకవర్గ

# బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం


### ముఖ్య అతిథిగా హాజరుకానున్న కేటీఆర్



ఇది కద నిజం,సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నేడు (జూన్ 3, బుధవారం) ఉదయం 10 గంటలకు సితాఫలమండీలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో జరగనుంది. సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ సూచన మేరకు ఈ కీలక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహ్మూద్ అలీ, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీలు డాక్టర్ దాసోజు శ్రవణ్, సురభి వాణి దేవి, మాజీ ఎమ్మెల్సీ సలీంలతో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొననున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, ఉద్యమకారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, యువత, విద్యార్థి, కార్మిక విభాగాల నేతలు, పోలింగ్ బూత్/బస్తీ కమిటీల సభ్యులు, కేసీఆర్, కేటీఆర్, పజ్జన్న అభిమానులు అందరూ ఈ సమావేశానికి విధిగా హాజరుకావాలని పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు. ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో అర్హులైన ఓటర్ల ఓట్లు పోకుండా జాగ్రత్తలు వహించడంతో పాటు, రాబోయే పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతం చేయడంపై ఈ సమావేశంలో క్షేత్రస్థాయి శ్రేణులకు ముఖ్య నాయకులు దిశా నిర్దేశం చేయనున్నారు.

# 'సర్' ప్రక్రియలో ప్రజల్ని భాగస్వాములను చేయండి

### : సీఎస్ రామకృష్ణారావు



హైదరాబాద్: ఓటరు జాబితా ప్రక్రియలో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. 'సర్' ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 4, 6, 9, 10 తేదీల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన వివరించారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్లలో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో పంటల వైవిధ్యతపై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణంపైనా అవగాహన కల్పించాలని సూచించారు.

# మిలియన్ మార్చ్ ను తలపించేలా భూపోరాటం

- జులై 2 న ఉప్పల్ భగాయల్ లో పెద్ద ఎత్తున భూపోరాటం చేస్తాం
- పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిస్తున్న
- ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి ప్రకటన చేయకపోవటం దుర్మార్గం
- ఆగస్ట్ 6 లోగా ప్రొఫెసర్ జయశంకర్ గారి విగ్రహం ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

**ఇది కద నిజం,హైదరాబాద్:**

తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న 250 గజాల స్థలం కోసం మిలియన్ మార్చ్ ను తలపించే భూ పోరాటాన్ని చేస్తామని తెలంగాణ రక్షణ సేన ఛీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై విస్పష్ట ప్రకటన చేస్తారని భావించినప్పటికీ మరోసారి మోసం చేశారన్నారు. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటంతో సిద్ధించిన తెలంగాణలో వారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాది వేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం 12 ఏళ్లైనా హైదరాబాద్ లో ఏర్పాటు చేసుకోకపోవడం అన్యాయమన్నారు. ఆగస్ట్ 6 లోపు జయశంకర్ సార్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి కవిత అల్టిమేటం జారీ చేశారు.

### మిలియన్ మార్చ్ తరహా భూపోరాటం

ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగానైనా అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటిస్తారని భావించినప్పటికీ మళ్లీ మోసం చేశారని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

కనీసం అ అంశాలను ప్రస్తావించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. కేకే కమిటీ విధివిధానాలను కూడా ప్రభుత్వం ఇప్పటివరకు ప్రకటించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం జులై 2న ఉప్పల్ భగాయత్ వేదికగా అతి పెద్ద 'భూపోరాటం' చేపట్టనున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ కార్యక్రమానికి రాజకీయ పార్టీలతో ఎటువంటి సంబంధం లేదని, ఇది తెలంగాణ



అస్తిత్వం, ఉద్యమకారుల ఆత్మగౌరవ పోరాటమని స్పష్టం చేశారు. ఈ మహా సంగ్రామానికి రాష్ట్రంలోని మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, న్యాయవాదులు, పత్రికా మిత్రులతో పాటు ప్రజలు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఊరికి ఒక్కరైనా సద్ది కట్టుకొని తరలిరావాలని కోరారు. 'మిలియన్ మార్చ్' ను గుర్తు చేసే విధంగా ఈ భూపోరాట ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కవిత పిలుపునిచ్చారు.

### ఆగస్ట్ 6 లోగా జయశంకర్ సార్ విగ్రహం పెట్టాలి

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుని 12 ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోకపోవడం అత్యంత అన్యాయమైన విషయమని కవిత అన్నారు.

తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాదులు వేసి, మలిదశ పోరాటానికి దిక్సూచిగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిదీ అని అన్నారు. తెలంగాణ జాగృతి తరఫున ఇప్పటికే నాలుగు జిల్లాల్లో జయశంకర్ సార్ విగ్రహాలను ఏర్పాటు చేశామని కవిత గుర్తు చేశారు. అయితే రాష్ట్ర రాజధానిలో ఆయన విగ్రహం ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో జయశంకర్ సార్ విగ్రహ ఏర్పాటు కోసం తెలంగాణ జాగృతి సంస్థ 2014 నుంచే ప్రయత్నం చేస్తుందని చెప్పారు. 2017 లో అప్పటి మున్సిపల్ శాఖకు కూడా అధికారికంగా లేఖ రాసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోకపోవటం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేన్నరేళ్లు గడుస్తున్న విగ్రహం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి అయిన ఆగస్ట్ 6 లోపు ట్యాంక్ బండ్ పై విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి లేఖ రాశామని కవిత చెప్పారు. తమకు అవకాశం ఇస్తే ఆ విగ్రహ ఏర్పాటుతో పాటు లైఫ్ టైమ్ మెయింటెనెన్స్ ను కూడా తామే చేపడతమన్నారు. తమకన్నా గొప్పగా ప్రభుత్వమే స్వయంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. కానీ ఆగస్ట్ 6 లోపు హైదరాబాద్‌లో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం

రాష్ట్ర సాధనకు ప్రాణ త్యాగం చేసిన అమరవీరులు,



ఉద్యమకారులను మది నిండా, ఆర్తితో గుర్తు చేసుకుంటున్నామని అన్నారు. ఉద్యమంలో ఆస్తులు, ఉద్యోగాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేసిన వారందరికీ సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. అలాంటి వారందరినీ అన్ని విధాలా ఆదుకొని, సముచిత రీతిలో గౌరవించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి అమరవీరుడి కుటుంబానికి 1 కోటి రూపాయల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఉద్యమకారులందరినీ తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని చెప్పారు. ఎందరో ఉద్యమకారుల పోరాటం, ప్రాణ త్యాగాలతో రాష్ట్రం సిద్ధించిందని గుర్తు చేశారు. ఉద్యమ చరిత్ర ఇప్పటి పిల్లలంతా కచ్చితంగా తెలుసుకోవాలని కవిత సూచించారు. జూన్ 2 అనేది హాలిడే కాదని.. తెలంగాణ సమాజానికి ఎలాంటి వివక్ష లేకుండా, తమ సొంత యాసను తాము స్వేచ్ఛగా మాట్లాడుకునేలా చేసిన మహత్తరమైన రోజు అని చెప్పారు. మనమంతా సెకండ్ గ్రేడ్ పౌరులం కాదని నిరూపిస్తూ, ఎంతో స్వేచ్ఛగా బతికే చారిత్రక అవకాశం వచ్చిన రోజని అన్నారు. అందుకే ఆగస్టు 15 వేడుకలను ఎంత గొప్పగా జరుపుకుంటామో.. జూన్ 2 తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని కూడా అంతే గొప్పగా జరుపుకోవాలని సూచించారు.

---

## కాకతీయ యూనివర్సిటీలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**ఇది కద నిజం :** కాకతీయ యూనివర్సిటీలో 12వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరులకు నివాళు లర్పించి, వారి త్యాగాలు మరియు ఆశయాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు, మహిళలు సహా సమాజంలోని అన్ని వర్గాలు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. అనేక ఉద్యమాలు, పోరాటాలు, ప్రజల ఆకాంక్షల ఫలితంగానే 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావం కేవలం పరిపాలనా విభజన మాత్రమే కాదని, ప్రజల ఆత్మగౌరవం, స్వయంపాలన, ప్రాంతీయ అభివృద్ధికి నాంది పలికిన చారిత్రాత్మక ఘట్టమని ఆయన వివరించారు. తెలంగాణ ఉద్యమ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధన కోసం ప్రతి పౌరుడు కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. గత పన్నెండు సంవత్సరాలలో తెలంగాణ వ్యవసాయం, సాగునీరు, పారిశ్రామికాభివృద్ధి, విద్య, వైద్యం, సమాచార సాంకేతికత, మౌలిక సదుపాయాల రంగాల్లో విశేష పురోగతి సాధించి దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. గ్రామీణాభివృద్ధి నుంచి ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించే వరకు తెలంగాణ తన ప్రత్యేకతను చాటుకుంటోందన్నారు. అలాగే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భాష, కళలు, సాహిత్యం రాష్ట్ర గర్వకారణాలని పేర్కొంటూ, బతుకమ్మ, బోనాలు వంటి పండుగలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయని అన్నారు. ఈ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూనే అభివృద్ధి పథంలో ముందుకు సాగడం ప్రతి ఒక్కరి లక్ష్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు అవసరమైతే మరో ఉద్యమానికి కూడా సిద్ధంగా ఉండాల్సిన పరిస్థితులు తలెత్తకూడదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగాలని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థులు, యువత, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

---

## బీఎస్పీ మద్దతుతోనే తెలంగాణ రాష్ట్రం సాకారం - అంబాల ప్రశాంత్



**ఇది కద నిజం :**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రశాంత్ మాట్లాడుతూ,నాటి పార్లమెంట్‌లో బీఎస్పీకి ఉన్న 39 మంది ఎంపీల బేషరతు మద్దతు వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమ పార్టీగా ఉన్న టీఆర్ఎస్‌కు అప్పట్లో కేవలం ఇద్దరు ఎంపీలు మాత్రమే ఉండగా, బీఎస్పీ అధినేత్రి మాయావతి చిన్న రాష్ట్రాల సిద్ధాంతానికి కట్టుబడి ఎలాంటి రాజకీయ బేరసారాలు లేకుండా తెలంగాణకు మద్దతు ప్రకటించారని అన్నారు.లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి బీఎస్పీకి ఉన్న 39 మంది ఎంపీల మద్దతు తెలంగాణ బిల్లు ఆమోదంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు.తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన కోసం బహుజన తెలంగాణ నిర్మాణానికి బీఎస్పీ కట్టుబడి ఉందని అంబాల ప్రశాంత్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో, జిల్లా ప్రధాన కార్యదర్శి బోట్ల భరత్, నియోజకవర్గ ఇన్‌చార్జి సీత రాజ్‌కుమార్, పశ్చిమ ప్రధాన కార్యదర్శి నద్దునూరి దీపక్, అంబాల జాన్, మున్ని, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

---

## జమాల్‌పురంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ



ఇది కద నిజం :వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం జమాల్‌పురం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం జెండా వందనం చేసి,జాతీయ గీతం ఆలపించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కనుకయ్య యాదవ్ మాట్లాడుతూ,"అమరవీరుల త్యాగాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించడం మనందరి బాధ్యత. పేద ప్రజల కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని,గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి"అని పిలుపునిచ్చారు.తెలంగాణ సాధనలో అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ,తెలంగాణ గీతాన్ని ఆలపించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు.పొగాకు ఉత్పత్తుల వల్ల క్యాన్సర్ వస్తుందని, గుట్కా, పాన్ మసాలా, తంబాకులకు వ్యతిరేకంగా ఆశా కార్యకర్త కారింగుల జ్యోతక్క పాల్గొన్న వారిచే ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు,గ్రామ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్,ఆశా కార్యకర్త, అంగన్‌వాడీ టీచర్,మహిళా సంఘాల సభ్యులు,యువకులు, రైతులు,కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

## అన్నారం షరీఫ్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

### జాతీయ జెండా ఎగురవేసిన సర్పంచ్ గాడి పెల్లి మహేందర్- నూతన కార్యదర్శికి సన్మానం

**ఇది కద నిజం :**వరంగల్ జిల్లా :పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ గాడి పెల్లి మహేందర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.



ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందికి మెటీరియల్స్ పంపిణీ చేశారు. గ్రామానికి నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శి నిమ్మల రాజును శాలువాతో ఘనంగా సన్మానించారు.

అనంతరం స్థానిక యూపీఎస్ పాఠశాల ఆవరణలో జెండా ఆవిష్కరించి,బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులను బడికి పంపాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గొడుగు యాకంత, వార్డు సభ్యులు గాడి పెల్లి రాజబాబు,ముంజపల్లి నాగరాజు,రాపోలు అనిత, కొండేటి కొమరమ్మ,రామచంద్ర,దొంతమాల పవన్ కళ్యాణ్, బత్తిని జలంధర్, రామకృష్ణ,పస్తం రాధిక,గ్రామస్తులు సాంబయ్య,సాయిలు,కేదారే మహేందర్, పంచాయతీ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

---

## చౌటపల్లిలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బిఆర్ఎస్ జెండా ఆవిష్కరణ



ఇది కద నిజం : పర్వతగిరి మండలం చౌటపల్లి గ్రామం లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మట్టపల్లి వంశీ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పార్టీ యర్యకర్తల నడుమ గ్రామ పార్టీ అధ్యక్షులు మట్టపెల్లి వంశీ రావు జాతీయ జెండా మరియు బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేయడం జరిగింది.మన తెలంగాణను ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకోవడం కోసం కెసిఆర్ తన ప్రాణాలకు తెగించి చావు నోట్లో తలపెట్టి 9 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేశారు అలాగే తెలంగాణ సాధన కోసం చాలామంది యువత తమ ప్రాణాలను కోల్పోయారు కెసిఆర్ కృషి పట్టుదల యువకుల ప్రాణ త్యాగాల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడం జరిగింది.తెలంగాణ రాష్ట్రం సాధించుకొని నేటికీ 14 సంవత్సరాల సందర్భంగా తెలంగాణ ప్రజలు అందరూ సంతోషంగా పండగల జరుపుకోవడం జరిగింది.ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి విచ్చేసినటువంటి వారు బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మట్టపెల్లి పెద్ద మాధవరావు, చిన్న మాధవరావు, గోపాల్ రావు, తోట స్వామి, చిడిమల్ల అశోక్, గౌరారపు కుమారస్వామి , దేవరాజ్ , దామెర కళ్యాణ్ , కోతి పాపయ్య , గడ్డం క్రిష్ణ , జోరు సూర్య , నీలం రామయ్య , బిఆర్ఎస్ సీనియర్ నాయకులు , కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

---

## వర్ధన్నపేట క్యాంప్ ఆఫీస్‌లో జాతీయ జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే

### తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కేఆర్ నాగరాజు



ఇది కద నిజం :: వర్ధన్నపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, అమరవీరుల త్యాగఫలితంగా సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించడం మనందరి బాధ్యత. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగుతోంది. నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి అని పిలుపునిచ్చారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. తెలంగాణ గీతం ఆలపించి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అధికారులు,యువకులు పాల్గొన్నారు.